

# కరువు ఛాయలు...!



సల్కాపురంలోని పత్తి పొలంలో కలుపు తీసున్న రైతు కూలీలు

నెరవాడ వద్ద వాడిపోతున్న పత్తి మొక్క

- ఖరీఫ్ ప్రారంభంలో ఊరించిన రుతుపవనాలు
- ఆశాజనకంగా 1.22 లక్షల హెక్టార్లలో సాగు
- మొహం చాటేసిన వరుణుడు
- వాడుతున్న పైర్లను చూసి రైతు దిగాలు
- చినుకు రాలకపోతే పెట్టుబడి మట్టిపాలే

'తొలకరి వర్షాలు ఆశాజనకంగా కురవడంతో రోహిణి కార్తెలో పత్తి విత్తనాలు వేసుకున్నాం. మొలకెత్తిన పైరును చూసి కష్టాలు తీరుతాయని సంబరపడ్డాం. ఇంతలో వానలు పైపైకి పోయాయి. పోయినేడాది కూడా వానల్లేక అప్పుల పాలయ్యాం. ఈయేడైనా కష్టాలు తీరుతాయనుకుంటే ఇప్పుడు కూడా వానల్లేకపోవడంతో పెట్టుబడి మట్టిపాలయ్యే పరిస్థితి కనిపిస్తోంది'.
- కోసిగి మండలానికి చెందిన రైతు నరసింహులు కన్నీటి వేదన ఇది.

**కర్నూలు, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఏ పల్లెకు వెళ్లినా.. ఏ రైతును కదిపినా కరువు ఛాయలు, ఆవేదనతో కూడిన మాటలు తప్ప వేరే ఏమీ కనిపించడం లేదు.. వినిపించడం లేదు. వాన లేక మెట్టసాగు పంటలు బెట్టకు గురవుతున్నాయి. జూన్‌లో అధిక వర్షపాతం నమోదైనా.. ఈ నెలలో కనీస వర్షం కూడా పడలేదు. వారం పది రోజుల్లో పదును వర్షం పడకపోతే పత్తి, కంది, మొక్కజొన్న, ఆముదం.. వంటి పైర్లు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. మొక్కలు గిడసబారి.. పంటలు ఎండిపోయి పెట్టుబడి మట్టిపాలవుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1.22 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. గతేడాది 35 వేల హెక్టార్లు మాత్రమే సాగైంది.

జిల్లాలో ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 4,19,221 హెక్టార్లు ఉంది. తుంగభద్ర, వేదవతి, హంద్రీ నదులు ప్రవహిస్తున్నా.. ఖరీఫ్‌లో సాగు నీరు అందాల్సిన ఆయకట్టు ఎల్లెల్సీ, ఏబీసీ కింద 24,125 హెక్టార్లు (60,315 ఎకరాలు) మాత్రమే ఉంది. అందులో 35 వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి. 3.95 లక్షల హెక్టార్లలో పంటలు వర్షంపై ఆధారపడి సాగు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఖరీఫ్‌లో 4,19,221 హెక్టార్లలో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గురువారం నాటికి 1,21,995 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. అందులో పత్తి 82,279 హెక్టార్లు, వేరుశనగ 15,457 హెక్టార్లు, కంది 11,341 హెక్టార్లలో సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభం జూన్‌లో రుతుపవనాలు ఆశాజనకంగా ఉండడంతో సాధారణం కంటే అధికంగా వర్షం కురిసింది. దీంతో గతేడాది ఇదే సమయానికి 34,708 హెక్టార్లలో సాగు చేస్తే.. ఈ ఏడాది 1.22 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. అయితే.. జూన్ ఆఖరున, జూలై ప్రారంభం నుంచి మేఘం మొహం చాటేయడంతో పల్లెసీమల్లో కరువు ఛాయలు కమ్ముకొస్తున్నాయి. ఇప్పటికే రెండేళ్లుగా అతివృష్టి,ద అనావృష్టితో ఆర్థికంగా చితికిపోయిన మట్టిమనుషులు ఈ ఏడాది కూడా కరువు పరిస్థితి కనిపిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.



**జిల్లాలో 2024-25 ఖరీఫ్‌లో సాగు అంచనా, సాగైన పంటలు (హెక్టార్లల్లో)**

| పంటలు | అంచనా | సాగైనది |
|---|---|---|
| పత్తి | 2,43,689 | 82,278 |
| వేరుశనగ | 58,969 | 15,457 |
| ఆముదం | 9,231 | 2,181 |
| కంది | 25,557 | 11,341 |
| మొక్కజొన్న | 4,652 | 2,197 |
| మిరప | 29,998 | 879 |
| ఉల్లి | 15,697 | 2,691 |
| టమోటా | 2,606 | 341 |
| వరి ధాన్యం | 12,771 | 40 |
| జొన్న | 308 | 3 |
| సజ్జ | 3,639 | 2,345 |
| కొర్ర | 1,684 | 1,688 |
| ఇతర పంటలు | 10,420 | 4,124 |
| మొత్తం | 4,19,221 | 1,21,995 |

### పెట్టుబడి మట్టిపాలు

దుక్కులు, విత్తనాలు, ఎరువులు, కూలీలు కోసం ఇప్పటికే ఎకరాకు రూ.25 వేలు వరకు ఖర్చు చేశామని రైతులు అంటున్నారు. అంటే.. హెక్టారుకు సరాసరి రూ.50 వేలు ఖర్చు చేశారు. ఈ లెక్కన ఇప్పటి వరకు సాగు చేసిన 1,21,995 హెక్టార్లకు సుమారు రూ.550-600 కోట్ల వరకు మట్టిలో పోశారు. వర్షం వస్తుందనే ఆశతో కలుపులు, అంతర్ సేద్యం వంటి పనులు చేస్తున్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో వివిధ గ్రామాల్లో ఆంధ్రజ్యోతి బృందం పంట చేలను పరిశీలిస్తే.. వానలు పడక, భూమిలో తడిలేక, పంటలు ఎండు దశకు చేరుకుంటున్నాయి. పత్తి, కంది, వేరుశనగ పైర్లు చూసి రైతులు కంటతడి పెడుతున్నారు. పశుగ్రాసం కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం పది రోజుల్లో వర్షాలు కురవకపోతే అన్నదాతలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 77.7 మిల్లీ మీటర్లకు గానూ 140.1 మి.మీ. వర్షం కురిసింది. 81 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జూలై సాధారణ వర్షపాతం 90.7 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు కురిసిన వాన 6.9 మిల్లీ మీటర్లే.





### వానలేక పైరు ఎదుగూ బొదుగు లేదు

గ్రామాల్లో కరువు మేఘాలు కమ్ముకొస్తున్నాయి. మాకున్న ఐదు ఎకరాల పొలంలో పత్తి పంట వేశాం. రూ.లక్ష వరకు ఇప్పటికే ఖర్చు చేశాం. 20 రోజుల నుంచి వాన పడకపోవడంతో పైరు ఎదుగూబొదుగు లేకుండా ఉంది.
- దుబ్బేరి చిన్నారెడ్డి, నేలకోసిగి గ్రామం, కోసిగి మండలం



### వాన పైపైకి పోయింది

మాకు రెండెకరాల పొలం ఉంది. మరో రెండు ఎకాలు కౌలుకు తీసుకున్నాం. దాదాపు రూ.50-60 వేలు ఖర్చు పెట్టి పత్తి, మొక్కజొన్న సాగు చేశాం. వాన పైపైకి పోయింది. పైరు వాడిపోతోంది. పంటలను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. పోయినేడాది కూడా తీవ్రంగా నష్టపోయాం. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉంది.
- శంకరమ్మ, పెద్దపాడు, కల్లూరు మండలం



### మూడేళ్లుగా నష్టపోయాం

వర్షం నమ్ముకొని మూడేళ్లుగా నష్టపోతున్నాం. అతివృష్టి, అనావృష్టితో అప్పులపాలయ్యాం. పంట పండలేదు.. పండిన పంటకు గిట్టుబాటు ధరలేదు. మాకు 18 ఎకరాల పొలం ఉంది. పత్తి, పొగాకు, కంది సాగు చేస్తున్నాం. ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడి మట్టిలో పోశాం. మొలక దశలోనే చినుకు లేక పైరు వాడు దశకు చేరుకుంది. పంటను చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. మా రైతుల కష్టాలు ఏమని చెప్పేది.
- సత్యనారాయణరావు, నెరవాడ గ్రామం



### పెట్టుబడి మట్టిపాలే

రెండేళ్ల నష్టపోయాం. ఈ ఏడాది తొలకరిలో వానలు బాగా పడ్డాయి. కష్టాలు తీరుతాయని అనుకుంటే పైరు కీలక దశలో మేఘాలు మొహం చాటేస్తున్నాయి. మాకు 18 ఎకరాల పొలం ఉంది. ఇప్పటికే 13 ఎకరాల్లో పత్తి, మూడు ఎకరాల్లో కంది సాగు చేశాం. నాలుగు ఎకరాల్లో వేరుశనగ వేసేందుకు పొలం సిద్ధం చేశాం. వాన పైపైకి పోయింది. పోయినా ఏడాది కూడా అరకొర పంటే వచ్చింది. పత్తి క్వింటం రూ.6-7 వేలకు కూడా అమ్ముడుపోలేదు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి. వారం పది రోజుల్లో వర్షం పడకపోతే పెట్టుబడి మట్టిపాలైనట్లే.
- బి.గిడ్డయ్య, ఎ. గోకులపాడు గ్రామం




### వాన లేక పత్తి పైరు వాడిపోతోంది

ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాం. మూడు ఎకరాల్లో పత్తి, ఎకరంలో కంది సాగు చేశాం. దుక్కులు, ఎరువులు, విత్తనాల కోసం ఇప్పటికే ఎకరానికి రూ.25 వేల వరకు ఖర్చు చేశాం. పైరు ఏపుగా పెరిగే దశలో వానలు పడకపోడంతో వాడిపోతోంది.
- ఈశ్వరమ్మ, సలకాపురం, కల్లూరు మండలం



## సంక్షేమ హాస్టళ్ల సమస్యలపై నివేదిక ఇవ్వండి



కలెక్టర్ పి. రంజిత్ బాషా

**కర్నూలు(కలెక్టరేట్), జూలై 12:** జిల్లాలోని అన్ని సంక్షేమ శాఖల హాస్టళలో నెలకొన్న సమస్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని సంక్షేమ శాఖల హాస్టళ్లలో మరమ్మతులు, అదనపు గదులు, టాయిలెట్లుకు సంబంధించిన సమగ్ర నివేదికలను మండల డివిజన్ వారిగా వారంలోపు అందజేయాలని అన్నారు. వలసలు ఉన్న ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్లలో సీట్ల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అన్నీ హాస్టళ్లలో విద్యార్థులు పూర్తి స్థాయిలో చేరేవిధంగా అడ్మిషన్లను రేషనలైజ్ చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో సరైన భవన సదుపాయం లేకపోవడంతో నాలుగు బీసీ సంక్షేమ వసతి గృహాలను తాత్కాలికంగా మూసివేశామని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ వసతి గృహాలను మూసివేయకూడదని, వాటిని ఎక్కడికైనా తరలించడమో, లేక అద్దె భవనాల్లో నిర్వహించడమో చేయాలని ఆదేశించారు. బి. తాండ్రపాడులో గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహానికి అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్‌లో పని చేస్తున్న 44 మంది డైలీవేజ్ వర్కర్లకు వేతనాలు మంజూరు, అప్కాస్‌లో చేర్చే అంశాలపై లేఖను సిద్ధం చేయాలని సంబంధిత అధికారిని ఆదేశించారు.

**ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించాలి**

హాస్టళ్లలో ఉన్న పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మైనార్టీ సంక్షేమంలో భాగంగా ప్రధానమంత్రి 15 పాయింట్స్ ప్రోగ్రామ్‌ను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కామన్ సర్వీసు సెంటర్, ఉర్దూ డిగ్రీ కాలేజీ, హండ్రెడ్ బాయ్స్ హాస్టల్‌కు భూమిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్ ఖన్నా, ఈడీ బీసీ కార్పొరేషన్ జాకీర్, ఈడీ మైనార్టీ కార్పొరేషన్ సబీహా పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## పనుల పురోగతిపై జడ్పీ చైర్మన్ సమీక్ష

**కర్నూలు(కల్చరల్), జూలై 12:** జడ్పీలోని పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో జరుగుతున్న పనుల పురోగతిపై జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం జడ్పీలోని మినీ సమావేశ భవనంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో 5 శాతం ఎస్సీ ఈఎంఎఫ్, 6 శాతం ఎస్టీ ఈఎంఎఫ్, 5 శాతం డబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ ఈఎంఎఫ్ కింద మంజూరైన పనుల పురోగతిపై సమీక్షించారు. జడ్పీ సీఈఓ నాసరరెడ్డితో పాటు జడ్పీలోని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఈ ఆగస్టు మాసానికంతా ప్రారంభం కాని పనులను పూర్తి చేసి, సదరు రికార్డులను చెల్లింపుల కోసం జడ్పీ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. 6 శాతం ఎస్టీ ఈఎం ఎఫ్ పనుల కింద 5 పనులకు అంచనా రూ.23 లక్షలు, 5 శాతం డబ్ల్యూ అండ్ సీడబ్ల్యూ ఈఎంఎఫ్ కింద 25 పనులకు అంచనా రూ. 08.9 కాగా.. వీటిని పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, బనగానపల్లి, డోన్ సబ్ డివిజన్ల డిప్యూటీ ఈఈలు, ఏఈలు హాజరయ్యారు.

## కబ్జా స్థలంలో రాళ్ల తొలగింపు

- జేసీబీతో ఆక్రమణలను తొలగించిన అధికారులు
- ఆదోనిలో వైసీపీ కబ్జాదారుల నుంచి మున్సిపల్ పార్కు స్థలానికి విముక్తి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**ఆదోని రూరల్ , జూలై 12 :** ఆదోనిలో వైసీపీ భూ అక్రమాలకు ఎమ్మెల్యే, అధికారులు చరమగీతం పాడుతున్నారు. పట్టణంలోని అమరావతి నగర్‌లో సర్వే నెం. 8 /2, 82, 345లో దాదాపు రూ.కోట్ల విలువ చేసే రెండెకరాల మున్సిపల్ పార్కు స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లు వేసి రాళ్లు నాటిన వైసీపీ ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు, భూకబ్జాదారుడు ఎర్రిస్వామి భూ అక్రమణలపై ఆంధ్రజ్యోతిలో గురువారం వైసీపీ కబ్జాలో అమరావతినగర్ అనే శీర్షికతో కథనం అచ్చయింది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డి, తహసీల్దార్ హసినా సుల్తానా, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ఆ స్థలం కబ్జాకు గురైన మున్సిపల్ పార్కు స్థలానికి ఎవరికి పట్టాలు ఇవ్వలేదని ఎమ్మెల్యే చెప్పడంతో తక్షణమే ఆ రాళ్లను తొలగించి, ఆ స్థలానికి కంచె వేయాలని ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం ఆంధ్రజ్యోతి భూకబ్జాదారులను వదిలే ప్రసక్తే లేదు అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో అధికారులు ఎక్స్‌కవేటర్‌తో పార్కులో ప్లాట్ల కోసం ఏర్పాటు చేసిన రాళ్లను పెకలించిన ఆ రాళ్లను ట్రాక్టర్‌లో వేసుకొని మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. ప్రస్తుతం ఈ పార్కు స్థలంలో ముళ్లకంపలను తొలగించి కంచే వేసి కాపాడుతామని అధికారులకు తెలిపారు. ఆదోనిలో మార్పుకు నాంది పలకడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.





తొలగించిన రాళ్లను మున్సిపల్ కార్యాలయానికి తరలిస్తున్న ట్రాక్టర్

## హైకోర్టు ఆదేశాల మేరకు ముందుకు వెళ్లండి..!

### వైసీపీ ప్యాలెస్‌పై కేఎంసీ కమిషనర్‌కు కుడా వైస్ చైర్మన్ లేఖ

**కర్నూలు, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు నగరంలో అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయంపై హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్మన్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) కమిషనర్ భార్గవ్‌తేజకు శుక్రవారం లేఖ రాశారు. కర్నూలు నగరం నడిబొడ్డున రైల్వే స్టేషన్ రోడ్డు ఐదు రోడ్ల కూడలిలో దాదాపు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ ఆగ్రోస్ సంస్థ)కు చెందిన సర్వే నంబరు 95-2బీలో 1.60 ఎకరాల భూమిని కారుచౌకగా ఏడాదికి రూ.1,600 ప్రకారం 33 ఏళ్ల లీజుకు తీసుకొని వైసీపీ జిల్లా కార్యాలయం నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. గత జగన్ ప్రభుత్వంలో అధికారం మాటున ఎలాంటి అనుమతులు లేకుండా భారీ భవనం (ప్యాలెస్) నిర్మాణం చేపట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పొందడం, టీడీపీ అధికారంలోకి రావడంతో హడావుడిగా అనుమతుల కోసం కుడాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. గత నెల 17న కుడా టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్ర స్థాయి (పోస్ట్ వెరిఫికేషన్) చేయగా.. ఏపీ మెట్రోపాలిటియన్ రీజియన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ యాక్ట్-2016 యూ/ఎస్ 82 నుంచి 84 వరకు అవసరమైన ముందస్తు అనుమతులు లేకుండా వైసీపీ ఆఫీసు నిర్మిస్తున్నట్లు గుర్తించారు. అప్పటికే గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు నిర్మాణం పూర్తయింది. ప్లాస్టింగ్ పనులు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఏపీఎంఆర్ అండ్ యూడీఏ చట్టం-2016 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకురాదో నోటీసులు కూడా జారీ చేశారు.



అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

అయితే.. నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేస్తున్నామని, అక్రమ నిర్మాణం క్రమబద్ధీకరించుకోవడానికి తాము అర్హులమని, తదుపరి చర్యలు విరమించుకోవాలని కోరుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడు కర్నూలు కార్పొరేషన్ జారీ చేసిన సమాధానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వైసీపీ కార్యాలయం నిర్మాణాలు చేపట్టడానికి సరైన కారణాలు చూపాలని, లేని పక్షంలో ఏడు రోజుల్లోగా నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకోవల్సి ఉంటుందని కేఎంసీ కమిషనర్ జూన్ 24న వైసీపీ జిల్లా అధ్యక్షుడికి నోటీసు జారీ చేశారు. దీనిపై ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హైకోర్టును ఆశ్రయించారు. కుడా వైస్ చైర్మన్, కేఎంసీ కమిషనర్లను ప్రతివాదులుగా చేర్చారు. విచారించిన న్యాయస్థానం వైసీపీ కార్యాలయం నిర్మాణంలో జరిగిన అతిక్రమణలు (వైలేషన్) ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నప్పుడే కూల్చివేత వంటి చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో నిబంధనలు ప్రకారం ముందుకు వెళ్లాలని హైకోర్టు సూచించిందని, ఆ మేరకు ముందుకు వెళ్లాలని కుడా వైస్ చైర్మన్ రాసిన లేఖలో పేర్కొన్నారు. కర్నూలు కార్పొరేషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

# రోజుకో మలుపు..!

- మిస్టరీ వీడని వాసంతి మిస్సింగ్ కేసు
- పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తున్న బాలురు
- ముచ్చుమర్రిలో డీఐజీ తనిఖీలు
- ఆరో రోజు కూడా బయటపడని ఆనవాళ్లు

**నందికొట్కూరు, జూలై 12:** బాలిక అదృశ్యం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. నిన్నటి వరకు నీటిలో పడేశామని చెప్పిన ముగ్గురు బాలురు.. శుక్రవారం భూమిలో పూడ్చిపెట్టామని చెప్పారు. దీంతో ఆ ప్రదేశాన్ని చూపించాలంటూ ముగ్గురు బాలురను స్వయంగా డీఐజీ విజయరావు తీసుకొని ముచ్చుమర్రి, వనములపాడు పరిసరాలను తనిఖీ చేశారు. అయినా బాలిక ఆనవాళ్లు కనిపించలేదు. ఓ వైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మరో వైపు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వాసంతి ఘటనపై స్పందించారు. నిజానిజాలను వెలికితీసి దోషులను పట్టుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. దీంతో పోలీసులపై ఒత్తిడి పెరిగిపోతోంది. ఏకంగా డీఐజీ రంగంలోకి దిగినా వాసంతి ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసుల అదుపులో ఉన్న బాలురు మాత్రం పూటకో సమాధానం చెబుతూ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. దృశ్యం సినిమాను తలపించే విధంగా వాసంతి కేసులో విచారణ రోజుకో విధంగా మలుపు తిరుగుతోంది.

### పూటకో మాట చెబుతున్న మైనర్లు

వాసంతి అదృశ్యం కేసులో అనుమానితులుగా ఉన్న బాలురు పూటకో



కొత్త ముచ్చుమర్రి శ్మశానవాటిక వద్ద కేసీ కాలువపై తనిఖీలు చేస్తున్న డీఐజీ



ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ ముందు గ్రామస్తుల ధర్నా

మాట చెబుతున్నారు. ముందుగా కొత్త ముచ్చుమర్రి వద్ద శ్మశానవాటికలో పూడ్చిపెట్టామని చెప్పడంతో అక్కడకెళ్లి పోలీసులు పరిశీలించారు. అనంతరం శ్మశానానికి అవలి వైపున ఉన్న కేసీ కెనాల్ పోరంబోకు భూమిలో పూడ్చిపెట్టామని చెప్పడంతో అక్కడా తనిఖీలు చేశారు. అనంతరం వనములపాడు సమీపంలో పూడ్చిపెట్టామని చెప్పడంతో అక్కడ కూడా పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి ఆచూకీ కనిపించకపోవడంతో డీఐజీ ముగ్గురు బాలురను తీసుకొని పగిడ్యాల మీదుగా నందికొట్కూరుకు చేరుకున్నారు. దీంతో డీఐజీ వెళ్లిన వెంటనే ముచ్చుమర్రి నుంచి వనములపాడు వరకు కేసీ కెనాల్ పక్కనున్న ముళ్ల పొదలను తొలగించే పనిలో రెవెన్యూ అధికారులు పడ్డారు. ఇలా రోజుకో సమాధానం చెబుతూ ముగ్గురు బాలురు పోలీసులతో ఆడుకుంటున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఆరు రోజులవుతున్నా బాలిక ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు, బాలిక బంధువులు, కాలనీలోని ప్రజలు ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఎస్‌ఐ జయశేఖర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం పోలీసు వ్యవస్థ వాసంతి కోసమే గాలిస్తోందని అన్నారు. శనివారం ఎలాగైనా వాసంతి ఆచూకీ తెలుస్తుందని బాధితులకు సమాధానం చెప్పారు.

### ● పోలీసుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం:

విచారణ కోసం ముచ్చుమర్రికి వచ్చిన డీఐజీ విజయరావుతో వాసంతి కుటుంబ సభ్యులు మాట్లాడేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమి జరుగుతుందన్న విషయం కనీసం కుటుంబ సభ్యులకు తెలియజేయకుండా డీఐజీ వెళ్లడం సరైంది కాదంటూ మండిపడ్డారు.

## బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు

**పోలీసు స్టేషన్ వద్దకే బాధితులను పిలిపించిన వైనం**

**నందికొట్కూరు రూరల్, జూలై 12 :** ముచ్చుమర్రి గ్రామానికి వెళ్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని పోలీసులు శుక్రవారం అడ్డుకున్నారు. వాసంతి తల్లిదండ్రులు, బంధువులను పరామర్శించడానికి వెళ్తుండగా బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై నాగార్జున, జూపాడుబంగ్లా ఎస్సై లక్ష్మీనారాయణ పోలీసులతో కలిసి అదుపులోకి తీసుకున్నారు. శాంతి భద్రతలకు భంగం కలుగుతుందని చెప్పి బ్రాహ్మణ కొట్కూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి మాట్లాడించారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు పెద్దఎత్తున బ్రాహ్మణకొట్కూరు స్టేషన్‌కు చేరుకుని తమ నాయకుడిని వదిలిపెట్టాలని కోరారు. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితి బీహార్‌లోగాని,



బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ని అడ్డుకుంటున్న పోలీసులు

మణిపూర్‌లోగానీ లేదన్నారు. ఇది ఎవరు చేయిస్తున్నారో తనకు తెలుసు అన్నారు.

## కొనసాగుతున్న గాలింపు చర్యలు

**పగిడ్యాల, జూలై 12:** మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, పోలీసుల ఆధ్వర్యంలో సోలార్ స్కానింగ్, డిప్ డ్రైవింగ్ వంటి అత్యాధునిక పద్ధతులను అనుసరించి కాలువలో 35 అడుగుల లోతుకు వెళ్లి గాలింపు చర్యలు చేపడుతున్నారు. బాలిక ఆచూకీ లభ్యమౌతుందన్న ఆశతో తల్లిదండ్రులు, బంధువులు కాలువ వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.



ముచ్చుమర్రి ఎత్తిపోతల వద్ద గాలింపు చర్యలు చేపట్టిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

### బాలిక కుటుంబానికి పరామర్శ

వాసంతి కుటుంబ సభ్యులను రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు రుకియా బేగం శుక్రవారం పరామర్శించారు. బాలిక తల్లి సుజాతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, మంగవల్లి తదితరులు ఉన్నారు.

### ముచ్చుమర్రిలో అదే టెన్షన్

**విచారణ నిమిత్తం గ్రామానికి వచ్చిన డీఐజీ**

మండల పరిధిలోని ముచ్చుమర్రి గ్రామంలో వాసంతి అదృశ్యం గురించే చర్చ నడుస్తోంది. డీఐజీ విజయరావు బాలురను గ్రామానికి తీసుకొని వచ్చి విచారణ చేపట్టారు. గ్రామంలోని కేసీ కాలువ సమీపంలోని శ్మశానవాటిక వద్ద పరిశీలించారు. అక్కడి నుంచి కేసీ కాలువ వెంట వెళ్లి కొంత దూరంలో ముళ్లపొదల వద్ద నిలిపి తనిఖీ చేశారు. అక్కడి నుంచి పడమర వనములపాడు, పగిడ్యాల మీదుగా నందికొట్కూరుకు వెళ్లారు. డీఐజీ, పోలీస్ అధికారులు గ్రామానికి రావడంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు, బాలిక బంధువులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోవడంతో బాలిక బంధువులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## 19న జడ్పీ సర్వసభ్య సమావేశం

**కర్నూలు(న్యూసిటీ), జూలై 12:** జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, నూతనంగా ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యే ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. వ్యవసాయశాఖ, గ్రామీణ నీటి సరఫరా, నీటిపారుదల, విద్యుత్ శాఖలపై చర్చ ఉంటుందన్నారు.

## రైలు నుంచి కిందపడి మహిళకు తీవ్ర గాయాలు

**తుగ్గలి, జూలై 12:** రైలులో ప్రయాణిస్తున్న మహిళ కింద పడి తీవ్ర గాయాలపాలైంది. శుక్రవారం మండలంలోని రామలింగాయపల్లె, పగిడిరాయి స్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగింది. కింద పడిన మహిళను గమనించిన రైతులు డయల్ 100కి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు 108 అంబులెన్సును పంపించి క్షతగాత్రురాలిని పత్తికొండ వైద్యశాలకు తరలించారు. అపస్మారక స్థితిలో ఉండటంతో ఆమె ఎవరనే వివరాలు తెలియలేదు. ఎరుపు, నలుపు పూలు ఉన్న చూడీదార్, కాఫీ కలర్ లెగ్గిన్ వేసుకుంది. అయితే.. ఆమె రైలులో నుంచి జారీ పడిందా.. లేదా ఎవరైనా రైలు నుంచి కిందకు తోసేశారా.. అన్నది తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న జొన్నగిరి ఎస్‌ఐ చంద్ర పత్తికొండ వైద్యశాలకు వెళ్లి బాధితురాలిని పరిశీలించారు. అయితే రైలులో నుంచి జారీ పడటంతో రైల్వే పోలీసుల పరిధిలోకి వెళ్తుందా.. జొన్నగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుందా అనేది పరిశీలించి కేసు నమోదు చేస్తామన్నారు.

## సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

**బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు**



కంది విత్తనాలను ఉచితంగా అందజేస్తున్న బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

**గోనెగండ్ల, జూలై 12:** సమగ్ర సస్యరక్షణ చర్యలతో కంది పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ అశోక్, నిరంజన్, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి రైతులకు సూచించారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గోనెగండ్ల గ్రామాన్ని అపరాలు అనే ప్రోగ్రాం కింద దత్తత తీసుకున్నారు. దీంతో గోనెగండ్లలోని రైతులకు ఉచితంగా నాలుగు కేజీల కంది విత్తనాలను బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంది పంటను ఈ నెల చివరి వరకు సాగు చేసుకోవచ్చునని వర్షాధార పరిస్థితుల్లో బెట్టను తట్టుకోవచ్చునని తెలిపారు. ఎకరానికి నాలుగు కేజీల విత్తనాలు సరిపోతాయని, విత్తే వరుసల మధ్య దూరం 90 సీఎంలు ఉండాలని వరుసలో మొక్కల మధ్య దూరం 20 సెంటీమీటర్ల నుంచి 30 సెంటీ మీర్ల వరకు ఉండాలని సూచించారు. ఎకరానికి ఎనిమిది కేజీ నత్రజని, 20 కేజీల భాస్వరం వేసుకోవాలన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏవో హేమలత, టీడీపీ నాయకులు నజీర్‌సాహెబ్, తిరుపతయ్యానాయుడు, బేతాబడేసా, రమేష్‌నాయుడు, చిన్ననేలటూరు నాగన్న, ఏఈ శ్రీహరి, వీఏఏ మహేంద్ర పాల్గొన్నారు.

## ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి

**దేవనకొండ, జూలై 12 :** కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం కుంకనూరు రోడ్డులో జరిగింది. కుంకనూరు గ్రామానికి చెందిన నాగర్జున (32) ఆటో నడుపుతూ జీవనం సాగించే వాడు. శుక్రవారం రాత్రి గ్రామానికి వెళ్తుండగా రోడ్డుపై కుక్క అడ్డం వచ్చింది. దాన్ని తప్పించబోయి ఆటో బోల్తాపడటంతో నాగర్జున తీవ్రంగా గాయపడ్డాడు. .స్థానికులు గమనించి వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య మానస, ఏడాది పాప ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

**డోన్(రూరల్), జూలై 12:** డోన్ మండలం వెంకటనాయునిపల్లె గ్రామంలో మాధవయ్య అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో డోన్ పట్టణ పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. పట్టణ సమీపంలోని దత్తాత్రేయ స్వామి ఆలయ సమీపంలో నిందితులు చెన్నయ్య నాయుడు, ఇంద్రప్రతాప్ నాయుడు, రంగన్న నాయుడు, సురేష్ నాయుడు, మహేశ్వరి, లక్ష్మీదేవిలను అరెస్టు చేసి వారి నుంచి రెండు వేటు కొడవళ్లను స్వాధీనం చేసుకున్నట్లు డోన్ పట్టణ ఏఎస్‌ఐ భాస్కర్ తెలిపారు. నిందితులను డోన్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఆగ్రోస్‌లో తవ్వేకొద్ది భారీ కుంభకోణాలు

- స్వచ్ఛాంధ్ర కోసమని నాసిరకం ట్రాక్టర్లకు రూ.30 కోట్ల ఖర్చు
- డెలివరీ కాకముందే అడ్వాన్సులు
- నిగ్గు తేల్చాలంటూ వ్యవసాయ మంత్రికి వినతి పత్రం అందించిన అసోసియేషన్ నాయకులు

**కర్నూలు(అగ్రికల్చర్), జూలై 12:** రైతులకు ప్రయోజనం చేకూర్చే దిశగా కార్యక్రమాలు చేపడుతున్న ఆగ్రోస్ సంస్థను గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు నిర్వీర్యం చేశారని ఏపీ ఆగ్రోస్ సంస్థ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం అమరావతిలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంటు కృష్ణారెడ్డి ఆగ్రోస్ సంస్థలో తవ్వేకొద్ది భారీ కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా సంస్థకు చెందిన రూ.101 కోట్ల నిధుల డిపాజిట్లను బ్యాంకుల్లో కుదువపెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఏ విధంగా ఖర్చు చేశారో సమగ్ర వివరాలతో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి పత్రం అందజేశామని అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంటు కృష్ణారెడ్డి ఫోన్‌లో విలేకరులకు తెలిపారు. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చి అక్రమాలకు పాల్పడిన ఉన్నతాధికారులతో పాటు ఆనాటి చైర్మన్, ఎండీలపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరామని అన్నారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ రెండు రోజుల్లో వస్తుందనగా.. ఆనాటి ఆగ్రోస్ సంస్థ ఎండీ, చైర్మన్లు సంస్థకు సంబంధించిన రూ.101 కోట్ల డిపాజిట్లను తనఖా పెట్టి స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అవసరమైన ట్రాక్టర్లను కొనుగోలు చేసేందుకు రూ.30 కోట్లను ఖర్చు చేశారని వినతి పత్రంలో మంత్రికి పూర్తి వివరాలతో బుక్‌లెట్‌ను అందించామని తెలిపారు. ఈ బుక్‌లెట్‌లో 1వ పేజీ



వ్యవసాయ మంత్రిని కలిసిన ఆగ్రోస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

నుంచి 53వ పేజీల్లో పూర్తి స్థాయిలో ఆగ్రోస్ సంస్థ ద్వారా ఏ విధంగా నిధులను అడ్డదిడ్డంగా దోచిందీ వివరాలను ప్రభుత్వానికి అందించామని కృష్ణారెడ్డి తెలిపారు. స్వచ్ఛాంధ్ర పేరుతో మహేంద్ర, తదితర కంపెనీల్లో తయారైన నాసిరకం ట్రాక్టర్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ అనుమతులు లేకుండానే అక్రమాలకు పాల్పడ్డారని, ట్రాక్టర్లను డెలివరీ చేసుకోకముందే అడ్వాన్సులను పెద్ద ఎత్తున ముడుపులు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. వీటన్నింటి మీద సమగ్ర విచారణ చేపడితే.. ఇంకా ఎన్నో అవినీతి అక్రమాలు వెలుగులోకి వస్తాయని మంత్రిని కోరినట్లు తెలిపారు.

## దళిత మహిళ హత్య

- ట్రాక్టర్‌తో గుద్ది చంపిన వైనం
- భూ తగాదాలే కారణం
- ఆదోని మండలం నాగనాథహళ్లిలో ఘటన

**ఆదోని రూరల్, జూలై 2:** భూతగాదాలో భాగంగా ఓ మహిళను ట్రాక్టర్‌తో గుద్ది హతమార్చిన సంఘటన ఆదోని మండలంలోని నాగనాథహళ్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. నాగనాథళ్లికి చెందిన గుండమ్మ(47)కు ఆదోని మండలం నాగనాథనహళ్ళి గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో వివాహమైంది. వీరికి సంతానం లేదు. భర్త మరణంతో ఆదోనికి చెందిన పురుషోత్తం రెడ్డితో కలిసి గుండమ్మ రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించింది. నాగనాథన హళ్లి గ్రామానికి చెందిన నలుగురు అన్నదమ్ముల్లో ఒకరైన సోమశేఖర్‌రెడ్డి మృతి చెందడంతో ఆయన భార్య తిరుమలమ్మ పుట్టినిల్లు మదిరెకు చేరుకొంది. ఆమె తన భాగానికి వచ్చిన సర్వే నెం.500-డిలోని నాలుగు ఎకరాల పొలాన్ని రియల్టర్ గుండమ్మకు 2019లో విక్రయించింది. గుండమ్మ ఈ పొలాన్ని సాగు చేస్తుండగా తిరుమలమ్మ భర్త కుటుంబీకులైన తండ్రీ కొడుకులు రాఘవరెడ్డి, శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఉదయం అడ్డుకున్నారు. గుండమ్మ, ఆమె వ్యాపారంలో భాగస్థుడైన పురుషోత్తంపై రాఘవరెడ్డి కర్రతో దాడి చేశారు. అక్కడితో ఆగకుండా శ్రీధర్‌రెడ్డి ట్రాక్టర్‌తో గుండమ్మను ఢీకొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన పురుషోత్తంరెడ్డిని స్థానికులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులు, పీరయ్య ఘటనా స్థలానికి చేరుకున్నారు.



గుండమ్మ (ఫైల్)



పురుషోత్తంరెడ్డిని కొడుతున్న దృశ్యం



దాడికి ముందు...

మృతురాలి పెంపుడు కుమారుడు కిశోర్ ఫిర్యాదు మేరకు జడ్డ శ్రీధర్‌రెడ్డి, జడ్డ రాఘవరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, బోయ రామకృష్ణ, దాసరి గోవిందులపై ఎస్సీ, ఎస్టీ కేసులతోపాటు హత్య కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇదిలా ఉండగా గుండమ్మను హత్య చేసిన నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కాగా ఈ దాడుల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గుండమ్మకు పిల్లలు లేకపోవడంతో అనాథాశ్రమంలో ఇద్దరు చిన్నారులను దత్తతకు తీసుకుని పెంచి పోషించింది. కుమారుడు కిషోర్ ఆటో నడుపుతున్నాడు. కుమార్తె శృతికి గుండమ్మ వివాహం చేసింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, వైసీపీ నాయకులు పరామర్శించారు.

## నగరంలో సత్యా ఏజెన్సీస్ రెండో షోరూమ్ ప్రారంభం

**కర్నూలు(కల్చరల్), జూలై 2:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల విక్రయ సంస్థ సత్యా ఏజెన్సీస్ వారి 25వ షోరూమ్ (కర్నూలులో రెండో షోరూమ్)ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో కేథడ్రిల్ చర్చి ఎదురుగా ఉన్న నూతన భవనంలో ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. షోరూమ్ ప్రారంభోత్సవాన్ని బిల్డింగ్ యజమాని మాకం నాగేషు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ ఏపీ హెడ్ సెంథిల్, వివిధ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సత్యా ఏజెన్సీస్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న షోరూమ్ బిల్డింగ్ ఓనర్ మాకం నాగేషు, తదితరులు

## ముగ్గురిపై కేసు నమోదు

**నందవరం, జూలై 12:** అక్రమంగా ఇతరుల భూమిని తమ పేరు మీదకు బదలాయించుకున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నందవరం ఎస్‌ఐ తిమ్మయ్య శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని మాచాపురం గ్రామానికి చెందిన కసిరెడ్డి శివారెడ్డి, నరసమ్మ దంపతులు నందవరంలో స్థిరపడ్డారు. గ్రామంలో వీరికి సర్వే నెంబరు 112-ఏలో 4.12 ఎకరాలు, సర్వే నెంబర్ 113-ఏలో 1-99 సెంట్ల పొలం ఉంది. దీన్ని మాచాపురం గ్రామస్తులైన మోషన్న, రత్నంలకు కౌలుకు ఇచ్చారు. వారు మృతి చెందాక మోషన్న కుమారులు సాగర్, విజయ రాజు కౌలుకు చేసుకునేవారు. కొన్నేళ్లగా వారు కౌలు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో పొలం వదిలి పెట్టాలని భూ యజమానులు చెప్పారు. దీంతో విజయరాజు, సాగర్ 3.10 ఎకరాల భూమిని తహసీల్దార్ కార్యాలయంలో రెడ్ మార్క్ పెట్టించారు. మిగతా 3.01 ఎకరాల భూమిని రత్నం కుమారుడు సుధీర్‌కుమార్ పేరు మీద ఆన్‌లైన్, అడంగల్, రిజిస్టర్‌లో చేర్చుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న భూ యజమానులు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించిన అనంతరం ఎస్‌ఐకు ఫిర్యాదు చేశారు. విచారించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

## మొక్కలే మనిషికి ఆధారం

### మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



ర్యాలీని ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 12: మొక్కలే మనిషికి జీవనాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం భాష్యం పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ సీఈవో అనిల్ కుమార్, శ్రావణ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



బర్న్స్ వార్డు వద్ద మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), జూలై 12: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. వరల్డ్ ప్లాస్టిక్ డేను పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని కాలిన రోగుల వార్డు వద్ద ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌లు మొక్కలు నాటారు. వర్షాకాలం నేపథ్యంలో ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటేందుకు వైద్యులు, విద్యార్థులు సిబ్బంది ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్ డేను పురస్కరించుకుని 50 మొక్కలను నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ డా.మంజులా బాయి, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనలిని, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఉద్యోగులు

### తడకనపల్లెలో ఉదయం 11.15 గంటలైనా తెరుచుకోని సచివాలయం


ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

కల్లూరు, జూలై 12: కల్లూరు మండలం తడకనపల్లె గ్రామంలో ఉదయం 11.15 గంటలైనా మొత్తం 10 మంది ఉద్యోగుల్లో ఒక్కరైనా విధులకు రాకపోవడంతో సేవల కోసం వచ్చిన ప్రజలు ఎదురు చూసి వెను తిరిగారు. మండల అధికారులకు, పంచాయతీ కార్యాలయ డీడీవోకు కనీస సమాచారం ఇవ్వకుండా విధులకు డుమ్మా కొడుతున్నారు. తడకనపల్లె గ్రామ పంచాయతీలో వామసముద్రం, ఓబులాపురం, ఓబులాపురం తండా మజరా గ్రామాలు ఉన్నాయి. నాలుగు గ్రామాలకు ఒకే సచివాలయం ఉంది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**షోకాజ్ నోటీసులు ఇస్తాం**

ఉద్యోగులు విధిగా ఉదయం 10.30 గంటలకు డ్యూటీలో ఉండాలి. విధి నిర్వహణలో బయటికి వెళ్లాల్సివస్తే సంబంధిత అధికారి అనుమతి తీసుకోవాలి. ఆ అంశాలను మువెంట్ రిజిస్టర్‌లో పోయిన, వచ్చిన సమయం నమోదు చేయాలి. ఈమేరకు ఆయన తడకనపల్లె సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి హాజరు పట్టికను పరిశీలించారు. షోకాజ్ నోటీసులు అందజేస్తాం.

- ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి

## మెడికవర్‌లో రోగికి అరుదైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్), జూలై 12: గుండెపోటుతోపాటు చిన్న పేగులో రక్తనాళాల్లో రక్తం గడ్డకటిన మెసెంటెరిక్ ఎంబోలిజంతో బాధపడుతున్న రోగికి కర్నూలు మెడికవర్ హాస్పిటల్ వైద్యులు చికిత్స అందించి ప్రాణాన్ని కాపాడారు. గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందిన కొండారెడ్డి అనే రోగి వాంతులతో బాధపడుతున్నాడు. గతంలో గుండెపోటు రావడంతో రక్తం గడ్డకట్టినట్లు గుర్తించారు. విజయవాడ, హైదరాబాదులోని పలు ప్రైవేటు హాస్పిటల్స్‌ను సంప్రదించినా సమస్యకు సరైన చికిత్స అందించలేకపోయారు. చివరి ప్రయత్నంగా కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లోని జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డా.భార్గవ్ వ్యాస్ ఏయాన్‌ను సంప్రదించారు. పరీక్షలు నిర్వహించి రోగి చిన్న పేగులో తిన్నది అడ్డుపడటం వల్ల సరిగా ఖాళీ కావడం లేదని గుర్తించారు. రోగి పేగు భాగాన్ని తొలగించి ఆరోగ్యకరమైన భాగాలను తిరిగి అమర్చడంతో కోలుకున్నాడు. మెడికవర్ హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ సరైన సమయంలో వైద్యం అందడం వల్ల రోగి కోలుకున్నాడని తెలిపారు.

## క్యాజువాల్టీలో రోగి మృతి

కర్నూలు(హాస్పిటల్), జూలై 12: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాల్టీలో గద్వాల జిల్లా గట్టుకు చెందిన ఓ రోగి మృతి చెందడం వివాదాస్పదంగా మారింది. గట్టుకు చెందిన 59 ఏళ్ల ఓ రోగి గత నెల 29వ తేదీన జీర్ణాశయ క్యాన్సర్‌తో ఆసుపత్రిలో చేరారు. వైద్యులు ఆపరేషన్ నిర్వహించారు. గురువారం రాత్రి రోగి ఆరోగ్యం విషమించడంతో సర్జరీ వార్డు నుంచి క్యాజువాల్టీకి రెఫర్ చేశారు. అక్కడ వైద్యం అందించిన తర్వాత మళ్లీ వార్డుకు తీసుకెళ్లారు. శుక్రవారం తెల్లవారుజామున రోగికి మళ్లీ సీరియస్ కావడంతో క్యాజువాల్టీకి తీసుకువచ్చారు. రోగి ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉన్నా వార్డు నుంచి క్యాజువాల్టీకి, క్యాజువాల్టీ నుంచి వార్డుకు తిప్పుతున్నారని బంధువులు వైద్యులతో వాదనకు దిగారు. చివరి వరకు వార్డులోనే ఉంచి ఉంటే వెంటిలేటర్‌పై వైద్యం అందేదని బంధువులు అంటున్నారు. చివరకు రోగి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 10 గంటలకు రోగి మృతి చెందాడు.



# పది విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలి

- మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి
- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- టౌన్ మోడల్ స్కూల్ తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 12: పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ హై స్కూల్‌లో కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. వంట సరుకుల నాణ్యత, కోడిగుడ్ల పరిమాణాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థులు ఆరుబయట భోజనం చేస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ వారిని కారిడార్‌లో కూర్చోబెట్టి భోజనం చేయించి ఆ తర్వాత కారిడార్‌ను శుభ్రం చేసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్ని గంటలకు భోజనం అందిస్తున్నారు.. భోజనం బాగుందా, రక్తపరీక్షలు చేస్తున్నారా.. ఐరన్, పోలిక్‌యాసిడ్ సప్లిమెంట్లు ఇస్తున్నారా.. అని ప్రశ్నించారు. అనంతరం ప్రాంగణంలో ఉన్న షెడ్స్, పరిరాలు, వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎం చాంబరులో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరు పట్టికను పరిశీలించి అందరూ ఉపాధ్యాయులు హాజరయ్యారా లేదా అని పరిశీలించారు. గత సంవత్సరం 46 శాతం మాత్రమే ఉత్తీర్ణత కావడం పట్ల కలెక్టర్ స్పందిస్తూ బీసీ, ఎస్సీ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు 80 శాతం పైగా ఉత్తీర్ణత సాధించారని, అలాగే ఇక్కడ కూడా ఉత్తీర్ణత శాతం తగ్గకూడదన్నారు. అనంతరం కళాశాల ల్యాబ్స్, లైబ్రరీని సందర్శించారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజనం చేసేందుకు ఒక షెడ్డు అవసరమని, కాలేజీ ప్రిన్సిపాల్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అందుకు సంబంధించి నివేదికలు పంపించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో శామ్యూల్, డిప్యూటీ డీఈవో హనుమంతరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న, ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రసాద్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి: సీపీఐ


ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు, జూలై 12: కల్లూరు అర్బన్ 20వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహంలో ఆమెకు వినతిపత్రం అందించారు. 2012లో 50 మంది పేదలు పగిడాల నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శివారెడ్డిల వద్ద ఒక్కో సెంటు ప్రకారం కొనుగోలు చేయగా సంబంధిత స్థలానికి రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్న ప్రజలకు కరెంట్ మీటర్లు, పన్ను, తాగునీటి సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. సత్యం బీమిరెడ్డి, శ్రీనివాసులు, రాజేష్, జయశంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్, జూలై 12: పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈవోఆర్డీ సందీప్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైనేజీలు, తాగునీరుపై దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి పైపులైన్లు మురుగుకాలువలలో ఉంటే వాటిని తొలగించాలన్నారు.

## మేయర్, కమిషనర్‌ను కలిసి పోస్టల్ అధికారులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 12: నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవతేజను శుక్రవారం కార్యాలయంలో తపాలా శాఖ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. తపాలా శాఖకు సంబంధించి ఆధార్, పాస్‌పోర్టు సేవలు, జీవిత బీమా, ప్రమాదబీమా పథకాలపై చర్చించారు. అనంతరం శ్రీరామ జన్మభూమి మందిర స్మారక తపాలా స్టాంపు లను, నమూనాలను మేయర్, కమిషనర్లకు అందజేశారు. పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెం డెంట్ రహమాన్, ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ఎం.అజీజుద్దీన్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మాదన్న పాల్గొన్నారు.

**మంత్రి క్యాంపు కార్యాలయానికి సామగ్రి:** మంత్రి టీజీ భరత్ క్యాంపు కార్యాలయానికి తగిన సామగ్రి అవసరమంటూ నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ కార్యదర్శికి లేఖ రాశారు. నగరంలోని రామలింగేశ్వర్‌నగర్‌లో మంత్రి కోసం నూతనంగా తీర్చిదిద్దుతున్న క్యాంప్ కార్యాలయానికి వీడియో కాన్ఫరెన్స్‌కు అవసరమైన సామగ్రిని పంపించాలని ప్రభుత్వ కార్యదర్శిని కోరినట్లు కమిషనర్ లేఖలో పేర్కొన్నారు.

# మంత్రి ఆదేశాలతో రోడ్డు వెడల్పునకు చర్యలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 12: మంత్రి టీజీ భరత్ ఆదేశాల మేరకు బుధవారపేట మెడికల్ కాలేజీ గేటు వద్ద రోడ్డు వెడల్పునకు అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారపేట వద్ద మలుపు వద్ద వాహనదారులకు ట్రాఫిక్‌తో ఇబ్బందితోపాటు పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ విషయంపై ఇటీవల నగర పాలక అధికారుల సమీక్షలో రోడ్డు వెడల్పునకు చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ రోడ్డు మలుపును పరిశీలించి, షాపుల యజమానులతో మాట్లాడారు. రహ దారి మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులు ఉండగా, అక్కడ 100 అడుగుల రహదారి మాత్రమే ఉన్నట్లు కమిషనర్ గుర్తించారు. మలుపుకు అవసరమైన 7 షాపులను తొలగించి, వారికి తగిన ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కమిషనర్ ఆదేశించారు. డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి, ఏసీపీ రంగస్వామి పాల్గొన్నారు.


దుకాణ యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవతేజ

## హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ


బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు

కర్నూలు(లీగల్), జూలై 2: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం కర్నూలులో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కోర్టు నుంచి రాజ్‌విహార్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ పెట్టుకుని ప్రయాణాలు చేయాలని ఆయన సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## లోకేశ్‌ను కలిసిన ముస్లిం మైనార్టీ నాయకుడు


లోకేశ్‌తో షేక్ అన్వర్ బాషా

ఓర్వకల్లు, జూలై 12: మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన గ్రామ టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ అన్వర్ బాషా శుక్రవారం మంగళగిరిలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఓర్వకల్లు మం డలంలో పరిశ్రమలు తెచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

## కె.నాగలాపురంలో పొలం బడి



పొలంబడిలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

గూడూరు, జూలై 12: మండలంలోని కె నాగలాపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఎల్ శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సుంకన్న పొలంలో పొలంబడి నిర్వహించినట్లు ఏఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం కె నాగలాపురంలో నిర్వహించిన పొలం బడిలో జీపీపీలో భాగంగా కంది పంటను నాటామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మీనా రాయణ, శ్రీవాణి, వీఏఏలు బీమ్లానాయక్, సుధాకర్, జడ్‌బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నిందితులను అరెస్టు చేయాలి

కర్నూలు(న్యూసిటీ), జూలై 12: ఆదోని మండలం నాగనాథన హళ్లి గ్రామంలో గుండమ్మను హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలని కులవివక్ష పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం పాతబస్టాండు అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.నరసింహులు, ఎన్.జి. కృష్ణ, చక్రపాణి పాల్గొన్నారు.

● నగరంలోని 24వ వార్డు లక్ష్మీనగర్‌లో చివరి లైన్‌లో డ్రైనేజీ, రోడ్డు వేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు.

## కఠినంగా శిక్షించాలి

కర్నూలు(కలెక్టరేట్), జూలై 12: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వాల్మీకి బోయ సేవా సంస్థ (వీబీఎస్ఎస్) వ్యవస్థాపక గౌరవాధ్యక్షులు కుబేర స్వామి, అధ్యక్షుడు తలారి కృష్ణనాయుడు అన్నారు. శుక్రవారం వీబీఎస్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రవిశంకర్ నాయుడు, కొల్లాయి పెద్దయ్య, మల్లికార్జున, శంకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి


డీఆర్వోకు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 12: ప్రభుత్వ ఉద్యోగాలకు డుమ్మా కొట్టి ప్రైవేటు కోచింగ్ సెంటరులో పని చేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర, నాగేష్‌లు డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో 20వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. అభ్యర్థులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కోచింగ్ సెంటర్లలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హుసేన్‌బాషా, ప్రకాష్, జిల్లా నాయకులు అబ్దుల్లా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చౌడేశ్వరీదేవికి శాకంబరి అలంకరణ


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

కర్నూలు(కల్చరల్), జూలై 12: నగరంలోని సప్తగిరి నగర్‌లోగల మణికంఠ అయ్యప్ప దేవాలయం ప్రాంగణంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం బోనాలతో ఆలయానికి చేరుకొని, అమ్మవారిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహికంగా లలితా సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్తీక దీపోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇ.పద్మావతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటే కానిది లేదు: ఎంఈవో


విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఎంఈవో ఆదాంబాషా

సి.బెళగల్, జూలై 12: పట్టుదల ఉంటే కానిది లేదని మండల విద్యాధికారి ఆదాంబాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పాఠాలను బోధించారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని చదువుకోవాలన్నారు. అనంతరం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఎంఈవో వెంట ప్రధానోపాధ్యాయుడు కిశోర్, సీఆర్‌పీలు ఉన్నారు.

## అంకితభావంతో పని చేయండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 12: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని కమిషనర్ భార్గవతేజ, మేయర్ బీవై.రామయ్య నూతనంగా ఉద్యోగం పొందిన వారికి సూచించారు. కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అర్హత సాధించిన ఇద్దరికీ శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్, మేయర్ నియామకపత్రాలు అందజేశారు. కార్యాలయంలో పని చేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన బి.శ్రీనివాసులు స్థానంలో ఆయన కుమారుడు బి.అమర్నాథ్, అలాగే బి.అయ్యన్న స్థానంలో కుమారుడు బి.శ్యాంబాబుకి సబార్డినేట్లుగా నియమించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

## నిధులు విడుదలపై హర్షం

కర్నూలు(న్యూసిటీ), జూలై 12: గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడంపై ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ.బి.రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అమరావతిలో రాష్ట్ర కమిటీ ప్రతినిధులతో కలిసి సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని సత్కరించారు. బిర్రు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పయ్యావుల కేశవ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లు విడుదల చేస్తూ తొలి సంతకం చేశారన్నారు.

## క్యాజువాల్టీ రోగులకు మెరుగైన వైద్యం


క్యాజువాల్టీలో పర్యటిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూలై 12: అత్యవసర రోగులకు క్యాజువాల్టీలో మెరుగైన సేవలు అందించాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి వైద్యులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన తనిఖీ నిర్వహించారు. క్షతగాత్రులకు కుట్లు వేసే సూచర్ రూమ్‌లో సౌకర్యాలు కల్పించాలని ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ రాంశివనాయక్, సీఈవో ఫయాజ్‌ను ఆదేశించారు. క్యాజువాల్టీలో పగిలిపోయిన టైల్స్‌ను మార్చాలని రోగులను స్ట్రెచర్‌పై తీసుకెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే క్యాజువాల్టీలో కార్టన్‌లను ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట అసోసియేట్ ప్రొఫెసర్ శారద, వైద్యులు, హెడ్ నర్సు, స్టాఫ్ నర్సులు, అనస్థీషియా టెక్నీషియన్ దినేష్‌లు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 12: నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈలు రాజేంద్రబాబు, నాగేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం అన్ని సబ్‌స్టేషన్లలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతులు అవసరమున్న చోట కరెంటు కోత ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

**గూడూరు:** రెండో శనివారం సాధారణ మరమ్మతుల నిర్వహణలో భాగంగా గూడూరు సబ్ డివిజన్ పరిధిలోని 33 కేవీ కోడుమూరు, కొత్తకోట, గూడూరు ఫీడర్లకు మరమ్మతు చేపట్టనుండగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గూడూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఈఈ/ ఆపరేషన్ జేసన్, ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆ సమయంలో కోడుమూరు, గూడూరు, సి బెళగల్ మండలాల పరిధిలోని అన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో మేయింటెనెన్స్ చేపట్టనుండగా విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

## విద్యుత్ అంతరాయాలకు పరిష్కారం చూపరా..?

కల్లూరు, జూలై 12: విద్యుత్ తీగలను ఆకులు చుట్టుముట్టి చెట్ల కొమ్మలు అంతరాయం కలిగిస్తున్నా అధికారులు పరిష్కారం చూపలేకపోతున్నారని పట్టణ పౌర సంక్షేమం సంఘం నాయకులు ఇరగినేని పుల్లారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం జాతీయ రహదారి లోకాయుక్త ఆఫీస్ సమీపంలో పట్టణ సంక్షేమ సంఘం బృందం పర్యటి ంచారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ చిన్నపాటి గాలివానకే కరెంట్ పోతుందని ప్రజలు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నయూం, ప్రభాకర్‌రెడ్డి, ఉజేర్‌అహమ్మద్ పాల్గొన్నారు.

## బోరుగడ్డ అనిల్‌పై కేసు నమోదు

కర్నూలు, జూలై 12: వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్‌పై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలు టీడీపీకి చెందిన తిలక్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బోరుగడ్డ అనిల్ రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబ సభ్యులపై గతంలో పలు వివా దాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 18న పాలిటెక్నిక్ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 12: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు కర్నూలు, నంద్యాల జిల్లాలోని అన్ని కళాశాల్లో ప్రవేశాలకు కర్నూలు బి.తాండ్రపాడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ ఫైనార్ట్స్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఏ.చక్రవర్తి శుక్రవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 8919638691 నెంబరును సంప్రదించాలన్నారు.

## మొహర్రం వేడుకలు ప్రారంభం

కోడుమూరు(రూరల్), జూలై 12: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. పులకుర్తి, బైనదొడ్డి, వర్కూరు, ప్యాల కుర్తి, ముడుమలగుర్తి, క్రిష్ణాపురం, గోరంట్ల, అనుగొండ, చిల్లబండ తదితర గ్రామాల్లో పీర్లదేవుళ్లు కొలువుదీరారు.

## నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 12: ఆదోని డివిజన్‌కు సంబంధించి నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్జీవో కార్యవర్గాన్ని శుక్రవారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వెంగల్ రెడ్డి నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా జవహర్, ఎంసీ కాశన్న, వెంకటేశ్వర్లు, కృష్ణుడు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**మంత్రాలయం, జూలై 12:** మంత్రాలయం ఓల్డ్‌టౌన్‌కు చెందిన దాసప్పగారి తిమ్మప్ప కుటుంబానికి ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మంచాల సొసైటీ అధికారి రామరాజు, సీఈవో ఖాజా హుశేన్, సొసైటీ బ్యాంకు నుంచి ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కును మృతుడి భార్య తిమ్మక్కకు అందజేశారు. గత డిసెంబరు 6న మృతి చెందిన తిమ్మప్ప కుటుంబానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ రాఘవేంద్ర, రాగప్ప పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు


మందులను పంపిణీ చేస్తున్న దాతలు, నాయకులు

**మద్దికెర, జూలై 12:** బొమ్మనపల్లి గ్రామంలో పెంకులింటి అనిత జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 600 మందికి గుండె వ్యాధి సంబంధిత పరీక్షలు, ఈసీజీ, రక్తపోటు, మధుమేహం, ఎముక సాంద్రత పరీక్ష, ఆక్సిజన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయులు, ప్రముఖ దాత పారా రామచంద్రప్రసాద్, మాజీ జడ్పీటీసీలు జమేదార్ రాజన్నయాదవ్, పి.పురుషోత్తం చౌదరి, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, ఎంపీటీసీ విజయలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ అశోక్ కుమార్, టీడీపీ నాయకులు సుధాకర్ చౌదరి, కొత్తపల్లి రంగస్వామి, ఐ.రాముడు, ఎన్. లక్ష్మీనారాయణ, మాజీ కోఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్ ఉన్నారు.

## కౌలు రైతులు కార్డులు పొందాలి

**మద్దికెర, జూలై 12:** కౌలు రైతుల కార్డులు తప్పకుండా పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి, బురుజుల గ్రామాల్లో సర్పంచులు కే మల్లికార్జున, పద్మావతి అధ్యక్షతన కౌలు రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల కార్డుల వల్ల భూ యజమానులకు ఎటువంటి నష్టం జరగదన్నారు. ఈ-కార్డు తీసుకోవడం వల్ల సాగుదారుడికి పంట నష్టం, పంటల బీమా సబ్సిడీ రాయితీ విత్తనాలు తదితర ప్రభుత్వ పథకాలు సాగుదారునికి అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు శివన్న, మల్లికార్జున, బాలవర్ధన్‌రాజు, వ్యవసాయ సిబ్బంది ఇంద్రజ, తదితరులు పాల్గొన్నారు.

## మినీ ఆటో నూతన కమిటీ ఎన్నిక

**వెల్దుర్తి, జూలై, 12:** పట్టణంలో ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం మినీ ఆటో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ ప్రభుత్వం ఆటో కార్మికుల కోసం సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యం కల్పిస్తూ ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా యేసయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.రాము, అధ్యక్షుడిగా రాఘవేంద్ర, ట్రెజరర్‌గా బాలరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మధు, ఈశ్వరయ్య, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య, మాధవస్వామి, నాగరాజు, బలరాం, కృష్ణ, మక్బుల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిందితులను శిక్షించాలి

**ఎమ్మిగనూరు టౌన్, జూలై 12:** ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు గ్రామంలో ఆశా వర్కర్ అయిన తోట రాధ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తోట రాధ గత నాలుగు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నా బలవంతంగా సర్వే పని చేయించారన్నారు. తోట రాధ మృతికి మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలే కారణమని ఆరోపించారు. తోట రాధ కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. వరలక్ష్మి, కవిత, గీతాంజలి, లింగమ్మ పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

**తుగ్గలి, జూలై 12:** పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని ఏవో పవన్‌కుమార్ రైతులను సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలిలో రైతులతో ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగం వల్ల భూమి నిస్సారమవుతుందని, పంటల సాగులో సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని, అప్పుడే భూమి సారవంతంగా మారుతుందని అన్నారు. అలాగే పెస్టిసైడ్స్ వినియోగం కూడా తగ్గించాలన్నారు. పంటల సాగులో అంతర్‌పంటలు ఖచ్చితంగా వేయాలని, పంటల మార్పిడి కూడా చేపట్టాలన్నారు.

## ఎంపీఈవోల సమస్యలపై న్యాయం చేస్తాం

**మంత్రాలయం, జూలై 12:** రాష్ట్రంలో ఎంపీఈవోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారని ఎంపీఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బసవరాజు అన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఎంపీఈవోల అసోసియేషన్ బృందం కలిసి ఎంపీఈవోలు ఎదుర్కొంటున్న సమస్యలను గత ఐదేళ్లుగా తాము ఎదుర్కొన్న సమస్యలను వివరించామన్నారు. మంత్రి స్పందించి మరో పది రోజుల్లో ఎంపీఈవోల సమస్యలపై చర్చించి సానుకూలత నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు అనిల్, నారాయణ, ప్రధాన కార్యదర్శి శశిబాబు, పురుషోత్తంరెడ్డి, రామాంజనేయులు, అశోక్ కుమార్, ప్రశాంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్రుడి సన్నిధిలో రైల్వే ఎస్పీ


మంత్రాలయంలో రైల్వే ఎస్పీ చౌడేశ్వరి

**మంత్రాలయం, జూలై 12:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం గుంతకల్లు రైల్వే ఎస్పీ చౌడేశ్వరి కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈమెకు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేశారు. ఈమె వెంట రైల్వే డీఎస్పీ అబ్దుల్ అజీజ్, రైల్వేఎస్ఐ రామస్వామి,మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

● మహారాష్ట్రలోని పూణేలో వరధేంద్రతీర్థుల మధ్యారాధన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు విశేష పంచామృతాభిషేకం నిర్వహించి వెండి, బంగారు, పట్టువస్త్రాలు, గులాబీ పుష్పాలతో అలంకరణ చేశారు.

● వరధేంద్రతీర్థుల సన్నిధానంలో నిర్మించే ధీరేంద్ర సభా భవనానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భూమి పూజ చేశారు.

## డ్రిప్పు వైర్లు, పైపులు చోరీ..

**తుగ్గలి, జూలై 2:** పొలంలో ఉన్న డ్రిప్పు, పైపులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించడంతో రైతుకు రూ.లక్ష నష్టం వాటిల్లింది. శుక్రవారం తుగ్గలికి చెందిన రైతు అల్లాబకాష్ తన పొలంలో ఉన్న డ్రిప్పు పైపులను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీ చేశారని రైతు తుగ్గలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైసీపీ జీఆర్‌పీని పట్టించుకోలేదు..

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


నిరుపయోగంగా ఉన్న బీసీ హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు, జూలై 12:** గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలన్ని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జీఆర్‌పీ, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఎత్తిపోతల పథకాలు ప్రస్తుత పరిస్థితిని, గత ప్రభుత్వంలో మంజూరైన నిధుల వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నియోజకవర్గంలోని కడిమెట్ల, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, హెచ్. కైరవాడి వ్యవసాయ పరపతి సహకార సంఘాల అధికారులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్నారు. నదిలో నీరు ఉన్న సమయంలో ఎత్తిపోసేందుకు అనువైన పరిస్థితులను కల్పించలేకపోయిందని ఆరోపించారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేయడంతో రైతులకు సాగునీరు అంతంత మాత్రంగానే ఉన్నదన్నారు. వాటిపై పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించి వాటి నిర్వాహణను బలోపేతం చేసి వాటి ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నియోజకవర్గంలో ఉన్న వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో రైతులకు అందుతున్న రుణాలు, కేడీసీసీ నుంచి వస్తున్న దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాల గురించి అడిగి తెలుసుకున్నారు. సొసైటీల్లో రుణాలు ఎవరెవరికి ఇచ్చారు.. ఎంతమేరకు ఇచ్చారు ప్రభుత్వం నుంచి ఏఏ నిధులు మంజూరయాయి.. వంటి వివరాలను పూర్తిస్థాయిలో తమకు ఇవ్వాలని మరోసారి సమీక్షిస్తామన్నారు. సంఘాల ఆధ్వర్యంలో రైతులకు సేవలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. టౌన్‌బ్యాంకు ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాలకవర్గం లేకపోవడంతో రుణాలు మంజూరు చేయడం కొంత ఇబ్బందిగా ఉందని, పరిశీలించి పాలక వర్గాన్ని ఏర్పాటు చేయాలని సీఈవో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఈ విజయరాజు, ఆయా సంఘాల సీఈవోలు దత్తాత్రేయ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లను నిర్వీర్యం చేసిన జగన్

సాంఘీక సంక్షేమ హాస్టళ్లను వైసీపీ ప్రభుత్వంలో జగన్ నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మండిపడ్డారు. ఈనెల 7న హాస్టళ్ల దుస్థితిపై ఇక్కడే పేద పిల్లల ఆశ్రమం అన్న శీర్షికన ఆంధ్రజ్యోతి కథనాన్ని వెలుగులోకి తెచ్చింది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బీవీ శుక్రవారం పట్టణంలోని బీసీ, ఎస్సీ బాలుర, బాలికల హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా గీతీనగర్‌లో ఉన్న బాలికల బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన పెట్టెలు వరండాలో ఉండడం, ఒకొక్క గదిలో 20 నుంచి 30 మంది విద్యార్థినిలు పడుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆశ్చర్యానికి లోనయ్యారు. ఒక గదిలో ఇంత మంది ఎలా ఉంటున్నారని, ఇలా ఉండడం వల్ల విద్యార్థినులు ఇబ్బంది పడరా అంటూ స్థానిక వార్డెన్‌ను ప్రశ్నించారు. అలాగే హాస్టల్‌లో ఎంతమంది విద్యార్థినులు ఉంటున్నారని, వారికి ఏఏ వసతులు కల్పిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్నారు. అనంతరం గుడికల్లు రోడ్డులో ఉన్న బీసీ కళాశాల హాస్టల్, గోనెగండ్ల రోడ్డులో ఉన్న బాలికల హాస్టల్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హాస్టళ్ల దుస్థితిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే విద్యార్థినులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్ రాందాసుగౌడు, మాజీ కౌన్సిలర్ రంగస్వామిగౌడు, హాస్టల్ వార్డెన్‌లు ఉన్నారు.

# గ్రామాభివృద్ధి అందరి బాధ్యత: డీఎల్‌పీవో

- నెలాఖరు లోపు వంద శాతం పన్నులు వసూలు చేయాలి


పంచాయతీ కార్యాలయం రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నూర్జహాన్

**గోనెగండ్ల, జూలై 12:** గ్రామాభివృద్ధికి ఆయా గ్రామాల ప్రజలు అందరి సహకరించాల్సిన బాధ్యత గ్రామ ప్రజలపై ఉందని డీఎల్‌పీవో నూర్జహాన్ అన్నారు. శుక్రవారం గోనెగండ్ల మేజర్ పంచాయతీని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్ఎస్ ట్యాంక్‌లోని నీటి క్లోరినేషన్‌ను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామంలో వంద శాతం పన్నులు వసూళ్లు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో 4320 గృహాలు ఉన్నాయని పన్నులు పూర్తి గా వసూళ్లు చేస్తేనే గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలు ఉంటుదన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని సూచించారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని అందుకు ఆయా గ్రామాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. గ్రామంలో ఇంటి పన్నులు, కొళాయి పన్ను, దుకాణా పన్నులు ఈ నెల చివరి లోపు వంద శాతం వసూళ్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే గతంలో పెండింగ్‌లో ఉన్న గుత్తలు కూడా వసూళ్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ నాగేష్, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# నిందితులను శిక్షించాలి


మాట్లాడుతున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ


ఆస్పరిలో రాస్తారోకో చేస్తున్న ఎఐఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు


మాట్లాడుతున్న స్త్రీ విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు సుజ్ఞానమ్మ


మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజక అధ్యక్షుడు రమేష్

**ఎమ్మిగనూరు టౌన్, జూలై 12:** నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం ముచ్చుమర్రి గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికను హత్య చేసిన నిందితులను శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలో సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఐదురోజులైనా బాలిక ఆచూకీ లభించకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షులు ఈరమ్మ, పద్మావతి, వాణి, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

**గోనెగండ్ల:** నందికొట్కూర్ తాలుకా ముచ్చుమర్రి గ్రామంలో 9ఏళ్ల బాలికను అతికిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, డప్పుకళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిన్నారులపై దాడులు పెరిగి పోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను పట్టుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. హత్యకు గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

● ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ అయిన బసివిని గుండమ్మను పొలం విషయంలో అగ్రకులస్తులు ట్రాక్టర్‌తో తొక్కించి హత్య చేయడం దారుణమని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. అడ్డుకోబోయిన వ్యక్తిపై కూడా దాడికి పాల్పడడం దారుణమన్నారు.

**ఆదోని (అగ్రికల్చర్):** ముచ్చుమర్రి గ్రామంలో బాలికను హత్య చేసిన నిందితులను బహిరంగంగా శిక్షించాలని పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు సుజ్ఞానమ్మ, ఏపీ ఎన్జీవో తాలూకా అధ్యక్షురాలు ఉషారాణి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎల్ఐసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లకు 12 ఏళ్లకే సెల్ ఫోన్లు ఇవ్వడం వల్ల అశ్లీల వీడియోలు, మద్యం తాగడం, గంజాయి వంటి అలవాటు పడి హత్యాచారాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంపూర్ణ మద్య నిషేధాన్ని రాష్ట్రంలో అమలు చేసి గుట్కాను గంజాయిని అరికట్టాలన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేవారు. ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళను ట్రాక్టర్‌తో దాడి చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు విజయలక్ష్మి, లతా ఉద్యోగ సంఘం నాయుకలు ప్రకాష్, ఓబుళపతి పాల్గొన్నారు.

**ఆదోని టౌన్:** రాష్ట్రంలో బాలికలకు రక్షణ కరువైందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్ల రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ దోకా ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ముచ్చుమర్రి గ్రామంలో మైనర్ బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, దేవిశెట్టి వీరేష్, వినీత్ రామన్నయాదవ్, హనుమంతు, దిసార్ అహ్మద్ పాల్గొన్నారు.

**ఆస్పరి:** బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మహేష్, తరుణ్, చరణ్ పాల్గొన్నారు.

**ఆలూరు:** నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం మచ్చుమర్రి గ్రామంలో బాలికను హత్య చేసి కాలువలో పడేయడం అమానుషమని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి శుక్రవారం పేర్కొన్నారు. హోంశాఖ మంత్రి అనిత ఈ ఘటనను సీరియస్‌గా తీసుకొని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## యజమానిపై ఎద్దు దాడి.. తీవ్ర గాయాలు

**మంత్రాలయం, జూలై 2:** మంత్రాలయం మండలంలోని వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన బోయ దేవేంద్రపై ఎద్దు దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. శుక్రవారం దేవేంద్ర పొలంలో దున్నుతుండగా ఎద్దు దాడి చేసింది. దీంతో ఆయన కడుపులోంచి పేగులు బయటపడ్డాయి. పక్క పొలం వారు గమనించి ఆయనను ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

## నలుగురు అరెస్టు

**ఎమ్మిగనూరు టౌన్/మంత్రాలయం, జూలై 2:** మండలంలోని రాంపురం సమీపంలో పంప్‌హౌస్ వద్ద కర్ణాటక మద్యాన్ని సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణలు తమ సిబ్బందితో దాడులు చేసి పట్టుకున్నారు. పది బాక్సుల్లోని 70 టెట్రా మద్యం ప్యాకెట్లను కర్ణాటక నుంచి ఆటోలో తీసుకువస్తుండగా పట్టుకున్నారు. ఇందులో 90ఎంఎల్ 480, 80 ఎంఎల్ 240 టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, రాంపురానికి చెందిన ఆటో డ్రైవర్ ముల్లా మహబూబ్, అదే గ్రామానికి చెందిన చాపల బాబు, కాచాపురానికి చెందిన బోయ ఈరన్న, బోయ రాఘవేంద్రలపై కేసు నమోదు చేశారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక మద్యంతోపాటు ఆటోను సీజ్ చేసినట్లు సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ లింగప్రసాద్, రబ్బాని, భరత్, నరసింహారెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

## ఉద్యోగావకాశాలు కల్పించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న అర్బన్‌హెల్త్ సెంటర్‌ల టెక్నీషియన్లు

**ఎమ్మిగనూరు, జూలై 12:** అర్బన్ హెల్త్‌సెంటర్లలో పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన వారికి తిరిగి ఉద్యోగావకాశాలు కల్పించాలని యూపీహెచ్‌సీ సిబ్బంది విజయమ్మ, రాధిక, దాదాబీ, అనంత్, సత్యమ్మలు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని కోరారు. శుక్రవారం వారు ఎమ్మెల్యే బీవీని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూపీహెచ్‌సీలలో 1579మంది ల్యాబ్ టెక్నీషియన్లు, డాటాఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్ఎంలు, హౌస్‌కీపింగ్ ఉద్యోగులు పని చేశారన్నారు. కొవిడ్ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించారన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వంలో నియమించారనే తమను 2021లో తొలగించారని ఎమ్మెల్యేకు వివరించారు. తిరిగి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఈరన్న పాల్గొన్నారు.

● కేజీబీవీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కేజీబీవీలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎమ్మెల్యేను ఇంటిదగ్గర కలిశారు.

## అర్హులందరికీ పథకాలు అందాలి

**కౌతాళం, జూలై 12:** అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా ప్రభుత్వం అందించే ప్రతిపథకం అందేలా మండల అధికారులు చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య అన్నారు. శుక్రవారం మండల అధికారులను కలిశారు. మండలంలోని అర్హత ఉండి ఇంకా పింఛనుకు నోచుకోని వారిని పంచాయతీ కార్యదర్శులు గుర్తించి వారందరికీ పింఛను వచ్చేలా చూడాలన్నారు. రైతుల పొలాల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. వెంట మాజీ ఎంపీటీసీ దేశాయి నరసింహమూర్తి స్వామి, టీడీపీ నాయకులు గోవిందు, అమ్మువలి, చిరంజీవి, తాయన్న, కోడిగుడ్ల రామాంజిని ఉన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

**మద్దికెర, జూలై 12:** ప్రభుత్వ వసతి గృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు కుట్టవని, పుట్టవని తాలుకా మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ ఆదర్శ పాఠశాల బీసీ హాస్టల్ యందు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వసతి గృహాల్లో వంట శాలలను పరిశీలించారు. దోమల ఉధృతి పెరగకుండా స్ప్రే చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి తదితరులు ఉన్నారు.

**దేవనకొండ:** పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చని వైద్యధికారి కళ్యాణ్ అన్నారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్ రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు రూరల్:** మలేరియా వ్యాధిపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి(ఏ.వో) చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం బనవాసి ఏజీఆర్‌జేసీ గురుకుల కళాశాల విద్యార్థినులకు మలేరియా వ్యాధి వ్యాప్తి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్త, వైద్యులు నరసింహులు, లక్ష్మన్న, ఉషా, విద్యార్థినులు పాల్గొన్నారు.

## నిబంధనలను పాటించాలి

**గోనెగండ్ల, జూలై 12:** నర్సరీలు ఏర్పాటు చేసుకున్న యజమానులు తప్పని సరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన నియమ నిబంధనలను పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామాంజినేయులు హెచ్చరించారు. శుక్రవారం గోనెగండ్లలోని నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం హెచ్ కైరవాడి గ్రామంలోని నర్సరీలను కూడా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రిజిస్టర్, బిల్లుబుక్స్ తప్పని సరిగా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఉల్లి పంటలను పరిశీలించారు. యాజమాన్య పద్ధతులకు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు ఉద్యనవనశాఖ అధికారి శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుకుందాం


మొక్క నాటిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

**ఆదోని (అగ్రికల్చర్), జూలై 12:** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. శుక్రవారం పట్టణంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేంద్రబాబు హెచ్ఎం సురేఖ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ

**ఆదోని టౌన్, జూలై 12 :** పట్టణంలోని విజయనగర్ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పూరి గుడిసె బాధితులను శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి కారణాలు బాధితులను, కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చెందవద్దని సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

**ఎమ్మిగనూరు రూరల్, జూలై 12:** ప్రభుత్వ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ శేషారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు బిల్లులను విడుదల చేసి పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో అబ్దుల్‌ఖాదర్, ప్రతాప్, భాస్కర్, రవి, వీరేష్ లు పాల్గొన్నారు.

## రాజకీయ వేధింపులు ఆపాలి

**పత్తికొండ టౌన్, జూలై 12:** వెలుగు సంస్థలో పొదుపు సంఘాలతో పనిచేస్తున్న వీవోఏలపై అధికార పార్టీ నాయకులు సాగిస్తున్న రాజకీయ వేధింపులను ఆపాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఈశ్వర్ రెడ్డి భవన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గ్రామాల్లో పొదుపు సంఘాలకు అనుబంధంగా పని చేస్తున్న వీవోఏలను తొలగించి, తమ పార్టీ సంబంధించిన వారిని నియమిస్తున్నారన్నారు. ఇప్పటికే పత్తికొండ మండలం చక్రాల గ్రామంలో ఈవోగా పని చేస్తున్న శ్రీనివాసులును తొలగించి అధికార పార్టీకి చెందిన వారిని నియమించారని, అలాగే పత్తికొండ పట్టణంలో సవారమ్మ కాలనీలో దేవి అనే మహిళను తొలగించి వేరేవారిని నియమించారన్నారు. అందుకు ఎమ్మెల్యే పేరు చెప్పుకుని రాజకీయ వేధింపులకు గురి చేయడం సమంజసం కాదన్నారు.

## గురుకుల విద్యార్థికి

## రూ.16 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



**ఆదోని (అగ్రికల్చర్), జూలై 12:** ఆదోని పట్టణం తిరుమల నగర్ ప్రాంతానికి చెందిన శ్రీహరికి రూ.16 లక్షల ప్యాకేజీతో భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సాధించారు. విద్యార్థి శ్రీధర్ ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్ గురుకుల్ కంగ్రీ డీమ్డ్ యూనివర్సిటీలో ఐబీటీ బీటెక్ ఈసీఈ ఇటీవల పూర్తి చేసుకున్నారు. మే నెలలో యూనివర్సిటీలో జరిగిన ఉద్యోగ మేళాలో ఎంపికైనట్లు తల్లిదండ్రులు రాఘవేంద్ర హేమలత తెలిపారు. తమ కుమారుడు శ్రీహరి భారత్ ఎలక్ట్రికల్ కంపెనీలో ఉద్యోగం రావడం అభినందనీయమని తెలిపారు.

## ఉత్తరప్రదేశ్‌లో కిడ్నాప్.. హొళగుందలో గుర్తింపు

తల్లిదండ్రులకు బాలికను అప్పగించిన పోలీసులు


హొళగుంద పోలీస్ స్టేషన్‌లో బాలికతో ఉత్తరప్రదేశ్ పోలీసులు

**హొళగుంద, జూలై 12 :** ఉత్తరప్రదేశ్‌లో మూడు నెలల క్రితం కిడ్నాప్ అయిన బాలిక హొళగుందలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ పోలీసులు హొళగుంద పోలీసులను శుక్రవారం ఆశ్రయించారు. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం హాజనారి గ్రామానికి చెందిన పల్లవ్ ఖాన్ కూతురును అదే గ్రామానికి చెందిన తరీన్ ఖాన్ అనే యువకుడు మాయమాటలు చెప్పి మూడు నెలల క్రితం హొళగుందకు తీసుకొచ్చాడు. ఇక్కడే పానీపూరి బండి నిర్వహించేవాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేసుకున్న ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు ఎస్సై చంద్ర యాదవ్, హెడ్ కానిస్టేబుల్ సోని రాణి, కానిస్టేబుల్ నరేంద్ర కుమార్ బృందం సెల్ టవర్ లోకేషన్ ఆధారంగా హొళగుందకు చేరుకుంది. స్థానిక పోలీసుల సహకారంతో బాలికను తండ్రికి అప్పగించారు. కిడ్నాప్ చేసిన నిందితుడిని జైలుకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## విద్యుదాఘాతంతో కిరాణా షాపు దగ్ధం

**ఆస్పరి, జూలై 2:** షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి కిరాణం షాపు దగ్ధమైంది. షాపులో ఉన్న వస్తువులు ఖాళీ, మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మండలంలోని అలిగేర గ్రామానికి చెందిన మూల హుసేనిసాహెబ్ పని ముగించుకొని షాపుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. రాత్రి 2.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో కిరాణా షాప్‌లో మంటలు వ్యాపించి అందులో ఉన్న ఫ్రిజ్, కిరాణ సామాన్లు, భూమి పట్టాదార్ పాసు బుక్కులతోపాటు మొత్తం కాలి బూడిదయ్యాయి.